పేదలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 29వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: పేద ప్రజలకు ఆర్థిక భరోసాను కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 29వ వార్డు సుల్తానాబాద్ నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాబాయ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మాలోతు బిక్షాలు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు రమావత్ శ్రీను నాయక్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. పథకాలను ఉపయోగించుకుంటున్న ప్రజలు తమ జీవన ప్రమాణాలను పెంచుకునేందుకు యత్నిస్తున్నారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సుల్తానాబాద్‌లో ఎక్కువ మంది ఎస్టీలు నివసిస్తుంటారని చెప్పారు. వార్డులో ఇన్‌కం ట్యాక్స్ చెల్లించేవారు మినహా మిగిలిన అందరికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు వివరించారు. వార్డులో 1,657 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 5,320 మంది నివసిస్తున్నారని పేర్కొన్నారు. వార్డులో ఇప్పటి వరకు రూ.21.56 కోట్ల సంక్షేమాన్ని అందించామని వెల్లడించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 738 మంది, వైఎస్సార్ ఆసరా ద్వారా 665 మంది, వైఎస్సార్ చేయూత ద్వారా 289 మందికి లబ్ధి చేకూరినట్టు వివరించారు. ఇళ్ల స్థలాలు 650 మందికి ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, కొర్రా యశోదా, 29వ వార్డు నాయకులు బలుగూరి సురేష్, వెంకటేశ్వర్లు, కొతవరపు రమణ, యనమల ఈశ్వర్, మల్లెల యల్లమంద, రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్ కుమార్, కాకి దేవసహాయం, కేసరి కృష్ణారెడ్డి, చుక్కా ఆనంద్, చుండూరి వెంకటేశ్వరరావు, చింతలచెరువు శ్రీనివాసరావు, సయ్యద్ దౌలత్, కాళిదాసు వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, షేక్ గఫూర్, చుండూరు సాయి, కుర్రా శ్రీను, బండ్లమూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం చూపించెను



జయదేవ్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నిఖిల్



వీరమ్మకు పింఛన్ అందిస్తున్న వాలంటీర్ షహనాజ్

తెనాలికి చెందిన ఇద్దరు వలంటీర్లు విధుల్లో అంకితభావం చూపించారు. గుంటూరు వెళ్లి మరీ తమ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్ అందించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న తెనాలి 12వ వార్డుకు చెందిన బేతాళ జయదేవ్‌కు ఆ వార్డు వలంటీర్ నిఖిల్ అక్కడకు వెళ్లి వికలాంగ పింఛన్ అందించారు. అలాగే 25వ వార్డుకు చెందిన బాపట్ల వీరమ్మ కాలుకు ఆపరేషన్ చేయించుకుని గుంటూరులోని కుమార్తె ఇంటి వద్ద బెడ్‌రెస్టులో ఉంది. ఈమెకు ఆ వార్డు వలంటీర్ షహనాజ్ గుంటూరు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందించారు. వీరిద్దరినీ స్థానికులు అభినందించారు.

– తెనాలిటౌన్/తెనాలిఅర్బన్

దివ్యాంగుడికి వీల్‌చైర్

తెనాలిఅర్బన్: బాలాజీరావుపేటలోని భవిత సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగుడికి సమత ఫ్రెండ్స్ అధ్యక్షుడు గుమ్మడి వెంకట నారాయణ బుధవారం వీల్‌చైర్‌ను ఉచితంగా అందజేశారు. భవిత సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసాదరావు, సర్వేశ్వరరావు, గణేష్, హరి, అప్పారావు, చంటి, సుబ్బారావు, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి విరాళం



తెనాలిఅర్బన్: మహాత్మా గాంధీ శాంతి ఆశ్రమ నిర్మాణానికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లక్కరాజు శ్రీనివాసప్రసాద్ రూ.50 వేలు, చిన్నారి లక్కరాజు శ్రీశరణ్య తాను దాచుకున్న రూ.2,500 నగదును బుధవారం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి అందజేశారు. కొల్లావారి వీధిలో జరిగిన కార్యక్రమంలో లక్కరాజు అనుపమ, లక్కరాజు రమాదేవి, వై. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో వద్ద రక్తదాన శిబిరం



తెనాలిఅర్బన్: రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా తెనాలి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉద్యోగుల నుంచి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఏఈ అధిరామ్‌నాయక్, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి, నాళం శ్రీమన్నారాయణ, ఈపూరి ప్రేమ్ కుమార్, జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మూర్తికి బంగారు పతకం

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ప్రఖ్యాత సర్జన్ డాక్టర్ చదలవాడ కృష్ణయ్య చౌదరి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. స్థానిక బోస్ రోడ్డులోని ఐఎంఏ హాలులో రాత్రికి జరిగిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా చినఅవుటుపల్లికి చెందిన ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తికి బంగారు పతకాన్ని తెనాలి వైద్యులు అందజేశారు. డాక్టర్ జె.విజయలక్ష్మి అధ్యక్షత వహించగా, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఇ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో బాలోత్సవం



తెనాలిటౌన్: గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో ఈ నెల 11, 12 తేదీలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలోత్సవం–2023 నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.సాంబిరెడ్డి తెలిపారు. బాలోత్సవం పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ కరోనా వల్ల పిల్లలు ఆటలు, వేడుకలు పాల్గొనలేదని వారిలో ఉత్సాహం నింపేందుకు సృజనాత్మకతను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలను వేడుకల్లో పాల్గొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తిచేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



తెనాలిఅర్బన్: పట్టణంలో పాడైన రోడ్లకు వెంటనే మరమతులు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ ఆదేశించారు. పట్టణంలో 23, 24, 25 వార్డులలో బుధవారం సాయంత్రం ఆమె పర్యటించారు. వార్డులలో జరుగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్లు తోక శిరిషా, పెదలంక లక్ష్మీలావణ్య, కో–ఆప్షన్ సభ్యురాలు గొరికపూడి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

తెనాలిటౌన్: కొల్లూరు మండలం చింతలంక, పెదలంక, గాజులంక గ్రామాలకు చెందిన దళితులపై అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు మంగళవారం చేసిన దాడిలో గాయపడి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి పరామర్శించారు. దాడికి కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. దాడిలో తోడేటి రాజేష్, గుంటూరు ఏసోబు, తోడిటి రవి గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దాడులు చేసిన వారిపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, బొనిగల ఆగస్టీన్ తదితరులు ఉన్నారు.

ఐఎల్‌ఎం కంపెనీకి 161 మంది ఏఎస్‌ఎన్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్, రామ్‌చంద్

తెనాలి: బెంగుళూరు కేంద్రంగా దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐఎల్‌ఎం కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థులు 161 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి నెలకు రూ.20 వేల వేతనం, ఉచిత వసతిని కంపెనీనే సమకూరుస్తుంది. ఆక్స్‌ఫర్డ్ సర్టిఫికేషన్‌కు అవసరమైన శిక్షణనూ ఇస్తుందని ఏఎస్‌ఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. బుధవారం కాలేజీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలేజీలో చదువుతున్నది పేద, మధ్యతరగతి విద్యార్థులైనందున ప్రతిఒక్కరూ ఉద్యోగ ఆఫర్ లెటరుతో బయటకు వెళ్లాలనేది తమ సంకల్పమని చెప్పారు. అందుకనుగుణంగా ఏటా ప్రణాళికాబద్ధమైన కృషితో విద్యార్థులకు శిక్షణనిస్తూ, అవకాశాలను అందుకునేలా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటికి మూడు కంపెనీలు చేసిన ఇంటర్వ్యూల్లో 674 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. వీరితో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఉన్నారు.

ప్రముఖ హార్మోనిస్ట్ దాసుకు సన్మానం



దాసును సన్మానిస్తున్న క్రీస్తుమణిమ్మ, భాస్కరరావు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం పవిత్ర హృదయాలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం తల్లిప్రేమ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ హార్మోనిస్ట్, రేడియో, టీవీ ఆర్టిస్ట్ అల్లడి దాసును సన్మానించారు. కార్యక్రమంలో క్రీస్తుమణిమ్మ, మాతంగి భాస్కరరావు, యార్లగడ్డ సత్యనారాయణ, రమావత్ నందారావు, యార్లగడ్డ మాణిక్యరావు, అల్లడి బాబ్జి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, సోమవరపు సాంబశివరావు, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, కంభం నరసింహారావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశంకర భారతీ నరసింహ సదనం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న తిరుమలరావు

తెనాలిటౌన్: పట్టణ నాజరుపేటలో నిర్మాణంలో ఉన్న విద్యాశంకర భారతీ నరసింహ సదనం భవనానికి వాణి పబ్లికేషన్ అధినేత చుండూరు మోహనకృష్ణ తిరుమలరావు రూ.లక్ష విరాళం అందజేశారు. వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణమూర్తికి నగదు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షులు సత్యనారాయణమూర్తి, రాజేంద్రప్రసాద్, నాగసుబ్రమణ్యం, కిషోర్, డాక్టర్ వేణుగోపాల్, అనిల్‌కుమార్, విజయసారథి, రామకృష్ణ, పింగళి వేణుధర్ పాల్గొన్నారు. దాత తిరుమలరావును అభినందించారు.

మూగజీవాలకు మెరుగైన వైద్యం



వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. బుధవారం స్థానిక పశువైద్యశాల వద్ద సంచార పశు ఆరోగ్యసేవ వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు 108 ద్వారా ఎలాగైతే సేవలందుతున్నాయో.. మూగజీవాలకు ఈ వాహనాల ద్వారా సేవలందుతాయని వివరించారు. పాడి రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేయగానే సంచార ఆరోగ్య సేవ వాహనాలలో వైద్యులు వచ్చి పశువులకు సేవలు అందిస్తారని వివరించారు. అవసరమైతే పశువును అదే వాహనంలో వైద్యశాలకు తరలిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, పశువుల డాక్టర్లు కొల్లిపర డాక్టర్ ఎస్.సాయి సతీష్‌రాజు, వల్లభాపురం డాక్టర్ జి.ప్రభు కిషోర్, మున్నంగి డాక్టర్ డి.జయశ్రీ, అత్తోట డాక్టర్ కె.సుజాత, చక్రాయపాలెం డాక్టర్ టి.నవ్య, సిబ్బంది ఎస్‌కె.సుబానీ సాహెబ్, వినయ్, ఇ.శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు ఆరిగ చంద్రారెడ్డి, కొల్లిపర గ్రామ పార్టీ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, ఝాన్సీ, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు నెర్లకుటుంబరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, జొన్నల శివారెడ్డి, అవుతు పోతిరెడ్డి, అన్నవరపు రమేష్, పిల్లి గంగాధర్, రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు

మున్నంగి(కొల్లిపర): యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మున్నంగి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి, మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నున్నా వెంకటేశ్వర్లు రైతులతో మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే మార్గలపై రైతులు దృష్టిసారించాలన్నారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు 50 శాతం రాయితీపై వేపనూనె, ట్రైకోడర్మ విరిడి జీవ సంబంధ పురుగు మందు ఉత్పత్తులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి దీనమ్మ, అభ్యుదయ రైతులు ఆరిగ చంద్రారెడ్డి, వంగా శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, నాయక్, ప్రతాప్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమిషనరేట్, జిల్లా ఉప వ్యవసాయ సంచాలకులు బాలునాయక్, జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు, జిల్లా లాం ఫాం కీటక శాస్త్రవేత్త ప్రసాద్, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి రాజకుమారి, జిల్లా ఏడీఏ, డీఆర్‌డీసీ ప్రవీణ, జిల్లా పొలంబడి మాస్టర్ ట్రైనర్, జిల్లా మానిటరింగ్ అధికారి కె.రమణ కుమార్, జిల్లా డీఎఓ కార్యాలయం టీఏ ఎన్.శ్రీవాణి, తెనాలి ఏడీఏ కె.వెంకటరావు, మున్నంగి ఆర్బీకే సిబ్బంది గోపిరెడ్డి, మహాలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేత

తెనాలిరూరల్: సాక్ష్యాధారాలు రుజువు కానందున హత్యకేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి కొత్తపేటకు చెందిన కొఠారి సామ్రాజ్యం రేపల్లె రూరల్ సర్కిల్ నగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020 నవంబర్ 3న హత్యకు గురయ్యారు. హంతకులు ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకుని మృతదేహాన్ని కాలువలో పడేసి వెళ్లారు. నగరం పోలీసులు కేసు నమోదు చేసి, బాపట్ల సమీపంలోని బేస్తవారిపాలెంకు చెందిన పోతార్లంక శ్రీనివాసరావు, అతని భార్య పద్మావతిని నిందితులుగా పేర్కొంటూ చార్జ్‌షీట్ దాఖలు చేసి వారిని కోర్టులో హాజరుపరిచారు. కేసు తెనాలిలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జి. మాలతి, నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుల తరఫున న్యాయవాదులు ఎస్‌టీ ప్రసాద్, షేక్ ఫిరోజ్‌బాషా, పేట ప్రత్యూష వాదనలు వినిపించారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో తెనాలిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఒక ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్ట్ భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వి. బాబుల నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 50 శాతం మార్కులు సాధించడంతోపాటు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో టీటీసీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థినులు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 8న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు డెమోకు హాజరు కావాల్సి ఉంటుందని వెల్లడించారు. పోస్టుకు ఎంపికైన వారికి అవుట్ సోర్సింగ్ పద్ధతిపై జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8328159776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యం

- ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకాని తరుణ్
- కేఎల్‌యూలో ముగిసిన స్మారక ట్రోఫీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షులు కాకాని తరుణ్ తదితరులు

తాడేపల్లి రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షులు కాకాని తరుణ్ అన్నారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ 2023 ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత మీదే ఆధారపడి ఉందని, టెక్నాలజీలో భారత యువత దూసుకు పోతున్నారని అన్నారు. ఉపకులపతి డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 75 జట్లు, 904 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. కేఎల్‌యూ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ హరికిషోర్ విజేతల వివరాలు వెల్లడించారు. బ్యాడ్మింటన్ మహిళా విభాగం సింగిల్‌లో ప్రథమ బహుమతిని ఎం.నివేద, ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం(చెన్నై), ద్వితీయ బహుమతిని పాలడుగు కీర్తిక, తృతీయ బహుమతిని పులివర్తి విన్సీ(కేఎల్‌యూ) సాధించారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో(సింగిల్), ప్రథమ బహుమతి శబరీశ్వరం(ఎస్‌ఆర్‌ఎం), ద్వితీయ బహుమతిని టి.విశ్వనాథ్ బాలు (కేఎల్‌యూ), తృతీయ బహుమతిని సర్వేష్(ఎస్‌ఆర్‌ఎం), డబుల్స్) ప్రథమ బహుమతి సర్వేష్, డి.నిషాంత్(ఎస్‌ఆర్‌ఎం), ద్వితీయ బహుమతిని యశ్వంత్ బాలు, కుమార్ మిశ్రా ఆప్రిత్(కేఎల్‌యూ) కైవశం చేసుకున్నారు. వాలీబాల్.. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి సత్యభామ విశ్వవిద్యాలయం(చెన్నై), ద్వితీయ బహుమతిని కేఎల్‌యూ (ఏపీ). ఖోఖో.. మహిళల విభాగంలో ప్రథమ బహుమతి కేఎల్‌యూ, ద్వితీయ బహుమతి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం. పురుషుల విభాగంలో.. ప్రథమ బహుమతి కేఎల్‌యూ, ద్వితీయ బహుమతి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం. కబడ్డీలో.. ప్రథమ బహుమతి కేఎల్‌యూ, ద్వితీయ బహుమతి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాల(హైదరాబాద్). అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల విభాగ అధిపతి చప్పిడి హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, క్రీడల విభాగ అధిపతి డాక్టర్ కె.సుజాత పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- చైల్డ్ లైన్ నోడల్ కోఆర్డినేటర్ బేబిరాణి
- తొమ్మిది మంది బాలకార్మికులకు విముక్తి
- నలుగురు వీధి బాలల గుర్తింపు



సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్న బాల కార్మికుడితో చైల్డ్‌లైన్ నోడల్ కో ఆర్డినేటర్ బేబిరాణి

మంగళగిరి: బాలలను పనుల్లో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్ లైన్ నోడల్ అధికారి బేబిరాణి హెచ్చరించారు. బుధవారం మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు చెప్పుల దుకాణాలు, కార్లు, బైక్ సర్వీసింగ్ సెంటర్లతో పాటు ఓ ఫ్యాన్సీ దుకాణంలో పని చేస్తున్న తొమ్మిది మంది బాల కార్మికులను, నలుగురు వీధి బాలలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ నోడల్ అధికారి బేబిరాణి మాట్లాడుతూ ఇటీవల మంగళగిరి నగరంలో వీధి బాలలు సంచరిస్తున్నారనే సమాచారంతో చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. బాలబాలికలను బడి మాన్పించి వెట్టి చాకిరీ చేయిస్తే అది నేరంగా పరిగణిస్తామని చెప్పారు. అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి మూర్తి, సీడీపీఓ విజయలక్ష్మి, బచ్‌పన్ బచావో రాష్ట్ర సమన్వయకర్త జి.తిరుపతిరావు, చైల్డ్ లైన్ మెంబరు ఎస్‌కే బాబు, ఏఎస్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

నృసింహుని భీష్మ ఏకాదశి పూజలు



పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున విష్వక్సేన, ఆరాధన, పుణ్యాహవాచనం, పంచామృత స్నపన, 12 రకాల ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, తీర్థగోష్టి, నరసింహుని హోమం, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని బంగారు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం శాసన స్తంభం, పూలమార్కెట్ సెంటర్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుని తిరిగి పెద కోనేరు మీదుగా దేవాలయానికి చేరింది. ఆయా కూడళ్లలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

చివలూరు(కొల్లిపర): చిరుధాన్యాలతోనే మానవాళికి ఆరోగ్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. బుధవారం చివలూరులో ఆర్బీకే కేంద్రంలో చిరుధాన్యాల ఉత్పత్తిపై వ్యవసాయాధికారులు రైతులకు శిక్షణ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే మేలన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు చిరుధాన్యాల సాగు గురించి వివరించారు. తొలుత స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అవుతు సీత నగేష్‌రెడ్డి , జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమిషనరేట్, జిల్లా ఉప వ్యవసాయ సంచాలకులు బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వల్లభాపురం(కొల్లిపర): వల్లభాపురం గ్రామ శివారులో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పంట పొలాల్లో ఆరుగురు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆర్. రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతున్న వ్యక్తుల దగ్గర నుంచి రూ.60,800 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.